నమస్తే తెలంగాణ | DISTRICT SUPPLEMENT

# వికారాబాద్

సోమవారం 9 అక్టోబర్ 2023 | VIKARABAD
MONDAY, OCTOBER 9, 2023



చించల్‌పేట, ముబారక్‌పూర్ గ్రామాల సమీపంలోని మూసీనదిపై నిర్మించిన వంతెనను ప్రారంభిస్తున్న మంత్రి మహేందర్‌రెడ్డి, చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య

## అభివృద్ధిని చూసి ఆశీర్వదించండి

- అన్ని వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి
- ప్రతిపక్షాల మాటలను నమ్మొద్దు
- యాదయ్యను భారీ మెజార్టీతో గెలిపించాలి
- రాష్ట్ర సమాచార, పౌరసంబంధాలు, గనులు, భూగర్భ వనరుల శాఖల మంత్రి డాక్టర్ పట్నం మహేందర్‌రెడ్డి
- రూ.9.74 కోట్లతో మూసీనదిపై నిర్మించిన వంతెనల ప్రారంభం, ముబారక్‌పూర్‌లో పంచాయతీ భవనం, కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన

నవాబుపేట, అక్టోబర్ 8 : రాష్ట్రంలో జరిగిన అభివృద్ధిని చూసి మరోసారి ఆశీర్వదించాలని రాష్ట్ర సమాచార, పౌరసంబంధాలు, గనులు, భూగర్భ వనరుల శాఖల మంత్రి డాక్టర్ పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన మండలంలోని చించల్‌పేట, ముబారక్‌పూర్ గ్రామాల సమీపంలోని మూసీనదిపై దాదాపుగా రూ.9.74 కోట్లతో నిర్మించిన వంతెనల ప్రారంభంతోపాటు ముబారక్‌పూర్ గ్రామంలో రూ.20 లక్షలతో నిర్మించనున్న పంచాయతీ భవనం, మరో 20 లక్షలతో చేపట్టనున్న కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అదేవిధంగా చేవెళ్ల మండలంలోని మల్కాపూర్ గ్రామంలో బీటీ, సీసీ రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, వైకుంఠధామం, పల్లెప్రకృతి వనం, మొయినాబాద్ మండలంలోని సురంగల్‌లో రూ.25 లక్షలతో నిర్మించిన సీసీరోడ్డు.. చేవెళ్ల మండల కేంద్రంలో మినీ స్పోర్ట్స్ స్టేడియం, ఎంపీడీవో నూతన కార్యాలయ భవనాలను ఎంపీ రంజిత్‌రెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్యలతో మంత్రి మహేందర్‌రెడ్డి ప్రారంభించారు. చేవెళ్లలోని షాబాద్ చౌరస్తా నుంచి ఎమ్మెల్యే యాదయ్య ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం అన్ని వర్గాల అభ్యున్నతికి విశేషంగా కృషి చేస్తున్నదన్నారు. పథకాల అమల్లో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. ఢిల్లీ పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్‌లను నమ్మొద్దని ప్రజలకు సూచించారు. ఎన్నికలప్పుడే ఆ పార్టీల నాయకులకు ప్రజలు గుర్తుకొస్తారన్నారు. వందేండ్ల ప్రగతిని పదేండ్లలో చూపిన ఘనత కేసీఆర్‌కే దక్కిందని స్పష్టం చేశారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ముచ్చటగా మూడోసారి కేసీఆర్‌ను సీఎంగా గెలిపించి రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి చేసుకుందామని మంత్రి మహేందర్‌రెడ్డి ప్రజలను కోరారు. ఎమ్మెల్యే కాలె యాదయ్యను భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో జరుగుతున్న సం క్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను చూసి ప్రతిపక్షాలు ఓర్వలేకపోతున్నాయని మండిపడ్డారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ భవాని, జడ్పీటీసీ జయమ్మ, ఏఎంసీ చైర్మన్ ప్రశాంత్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



## ఆసరాతో ఆనందం

సెంటర్ స్ప్రెడ్‌లో..

### పింఛన్‌దారులకు కొండంత అండగా నిలుస్తున్న పథకం

- దేశంలో ఎక్కడాలేని విధంగా అధిక మొత్తంలో పింఛన్లు అందజేత
- వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు తదితరులకు రూ.2016 పింఛన్
- పింఛన్ల నిమిత్తం నెలకు రూ.26 కోట్లను ఖర్చు చేస్తున్న కేసీఆర్ ప్రభుత్వం
- జిల్లావ్యాప్తంగా 1,10,983 మంది పింఛన్‌దారులు

ఆసరా పింఛన్లు అభాగ్యుల జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయి. వృద్ధులతోపాటు దివ్యాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలు తదితరులకు పింఛన్లు అందిస్తూ ప్రభుత్వం ఆర్థిక చేయూత కల్పిస్తున్నది. సీఎం కేసీఆర్ అధికారంలోకి వచ్చిన వెంటనే గత ఉమ్మడి ప్రభుత్వాలు పంపిణీ చేసిన అరకొర పింఛన్లకు స్వస్తి చెప్పి రూ.200 పింఛన్‌ను రూ.1,000, రూ. 500ల పింఛన్‌ను రూ. 1,500లకు పెంచారు. రెండోసారి కూడా ప్రజలు బీఆర్‌ఎస్ ప్రభుత్వానికే పట్టం కట్టడంతో రూ.1,000 పింఛన్‌ను రూ.2,016కు... రూ. 1,500 పింఛన్‌ను రూ.3,016కు పెంచారు. పింఛన్ పంపిణీకి గత ప్రభుత్వాలు నెలకు రూ.2 కోట్లు ఖర్చు చేయగా, సీఎం కేసీఆర్ ప్రభుత్వం మొదటగా రూ.12 కోట్ల మేర ఖర్చు చేసింది. తదనంతరం పింఛన్ డబ్బులు రెట్టింపు కావడంతోపాటు వయోపరిమితిని తగ్గించిన నేపథ్యంలో ప్రతి నెలా రూ.26 కోట్ల మేర ఖర్చు చేస్తున్నది. కాగా దేశంలోని ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా దివ్యాంగుల పింఛన్‌ను రూ. 4016లకు పెంచి పంపిణీ చేస్తున్న ఘనత మన ముఖ్యమంత్రికే దక్కింది. 2019-20 ఆర్థిక సంవత్సరంలో 1,05,495 మంది పింఛన్‌దారులకు రూ.230.94 కోట్లు, 2020-21లో 1,01, 579 మందికి రూ.253.79 కోట్లు, 2021-22లో 96,375 మందికి రూ.241.18 కోట్లు, 2022-23 ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు రూ.320 కోట్ల నిధులను ఆసరా పింఛన్ల నిమిత్తం ప్రభుత్వం ఖర్చు చేసింది. జిల్లావ్యాప్తంగా ఆసరా పింఛన్‌దారులు మొత్తం 1,10,983 మంది ఉన్నారు.

-వికారాబాద్, అక్టోబర్ 8(నమస్తే తెలంగాణ)

## కమీషన్ రెండింతలు

సెంటర్ స్ప్రెడ్‌లో..



- రేషన్ డీలర్లకు కమీషన్ పెంచిన ప్రభుత్వం
- టన్నుకు రూ.700ల నుంచి రూ.1400లకు పెంపు

చౌకధరల దుకాణాల డీలర్లకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. వారికి ఇస్తున్న కమీషన్‌ను రెండింతలు పెంచింది. ప్రస్తుతం టన్నుకు రూ. 700 కమీషన్ ఇస్తుండగా దానిని రూ. 1400లకు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో రేషన్ డీలర్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కమీషన్ పెంపు వల్ల వికారాబాద్ జిల్లాలోని 588 మంది రేషన్ డీలర్లకు ప్రయోజనం చేకూరనున్నది. జిల్లాలో 2,41, 264 రేషన్ కార్డులుండగా ప్రతినెలా 3,815 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని డీలర్లు వినియోగదారులకు పంపిణీ చేస్తున్నారు.

-బొంరాస్‌పేట, అక్టోబర్ 8